


# మృగం

శేషసాయి

జానకి చాలా అందంగా ఉంటుంది. ఎంత అందంగా ఉంటుందో, ఎలా అందంగా ఉంటుందో చెప్పగలిగిన వాళ్ళు చాలా తక్కువ - ఎందుకంటే - ఆమెను చూసిన వాళ్ళు తక్కువ కాబట్టి. అనలు ఆమె అందాన్ని ఎవరైనా ఎందుకు చూడాలీ - అనుకుంటాడు ఆనంద్.

ఆనంద్ జానకి భర్త. అతనూ అందంగానే ఉంటాడు. ఇద్దరిదీ 'చూడ' ముచ్చటైన జంట. తామరాకు మీద నీటిబొట్టు చూసేందుకు ఎంత ముచ్చటగా ఉంటుందో అంత ముచ్చటగా ఆమె అతని స్వంతం. ఆమె అందం కూడా అతని స్వంతమే. ఎవరైనా ఆమెను చూడటం ఇష్టం లేదతనికి. ఆమెను ఒకసారి చూచి తల మరల్చకుండా అలాగే చూసేవాళ్ళను చూస్తే వాళ్ళ కళ్ళు రంపాల్లా ఆమె అందాన్ని కోసేస్తున్నట్లూ, వాళ్ళ చూపులు ఆమె అందాన్ని నమిలి మింగుతున్నట్లూ కనిపిస్తా యతనికి. తను పోయి ఎంతమంది కళ్ళకు గంతలు కట్టగలడు? అందుకే ఆమెను బయటకు తీసికొని రాడు. ఊరి బయట ఉన్న బంగళాలో... ఆమె ఏం కావాలన్నా అవే ఆమె దగ్గరికి వచ్చేలా చేస్తాడు. వాటి దగ్గరికి ఆమెను తీసుకుపోడు.

ఓసారి...

"ఏమండీ ! ఎల్లుండి నా పుట్టిన్రోజుకి చీర కొనిస్తానని చెప్పారు. సాయంత్రం వెళ్దామా?"

"మనం వెళ్ళడ మెందుకూ? మన గురవయ్యకు చెప్తే ఇరవయ్యో ముప్ఫయ్యో చీరలు తెస్తాడు. నీకు ఎన్ని కావలిస్తే అన్ని తీసుకో."

మరోసారి...

"ఏమండీ. సినిమా కెళ్దామా?"

"నీకు ఏ సినిమా చూడాల నుందో చెప్పు. కాసెట్లు తీసుకొస్తా. అక్కడ టికెట్లు దొరక్క, క్యూలో నిలబడి, ఊపిరాడకుండా ఆ జనంలో సినిమా చూడ్డం - అదే పనిగా పోయి తలనొప్పి తెచ్చుకోవడమే."

వాళ్ళ సంభాషణ అలా ఉంటుంది.

ఆ ఇంట్లో ఉండే గోడలే ఆమె పాలిటి మనుషులు. ఆ ఇంట్లో ఉండే గదులే ఆమె తిరిగే విహారస్థలాలు. అక్కడ తిరిగే కోడిపిల్లలే ఆమె చూడగలిగిన జంతుజాలం. ఇంటి ఆవరణలోని చెట్లే ఆమెకు ప్రకృతి. ఆ ఇల్లే ఆమె ప్రపంచం.

** ** **

"జానకీ !"

ఆనంద్ అరుపులాంటి పిలుపుతో వంటింట్లోంచి హాల్లోకి వచ్చింది జానకి.

"బయట చూడు. నీకోసం ఏం తెచ్చానో !"

బయటికొచ్చి చూసింది. తాడుతో కట్టి జింకను లాక్కొని వస్తున్నాడు. గురవయ్య. కాళ్ళు కదల్చకుండా మొరాయిస్తుండడంతో ఎత్తుకొని వచ్చాడు.

"ఎలా ఉంది జింకపిల్ల?" దగ్గరి కొచ్చి అడిగాడు ఆనంద్. పెళ్ళైన రెండేళ్ళలో ఆనంద్‌ను అంత ఆనందంగా చూడ్డం ఆమె కదే మొదటిసారి.

జింకను ఇంటి వెనక కట్టేశారు పొడవైన తాడుతో. ఉదయం నిద్ర లేచిం దగ్గర్నుంచి ఆఫీసుకు పోయేంతవరకూ అతనికి జింకతోనే కాలక్షేపం. అది గెంతుతూ ఉంటే అతని ఆనందం చెప్పేదానికి లేదు. దాని బెదురుచూపులంటే మరీ ఇష్టం. జింక కళ్ళవైపే గంటల తరబడి చూసేవాడు. దానికోసం రకరకాల కూరగాయలు, ఆకులు, పచ్చగడ్డీ తెప్పించేవాడు. అది దేన్నీ తినకుంటే పాల సీసాతో పాలు తాపించేవాడు. ఒక విధంగా చెప్పాలంటే దాని ఆహార విషయంలో ప్రయోగాలు చేశాడు.

ఓ వారం రోజుల తరువాత...

జింకలో హుషారు పూర్తిగా పోయింది. ఏదీ తినడంలేదు. ఏదీ తాగడంలేదు. గెంతడం లేదు. ఓ మూల పడుకొని ఉంటోంది. 'దాన్ని ఎలాగైనా, మామూలు స్థితికి తీసుకొచ్చి మళ్ళీ గెంతించాలి' - అనుకున్నాడు ఆనంద్.

వెటర్నరీ డాక్టరు దగ్గరికి తీసుకుపోయాడు జింకని. దాని కేం కావాలో డాక్టరుకు తెలుసు. దానికేం కావాలో ఆనంద్ ఇవ్వడనీ తెలుసు. ఏదో ఇంజెక్షన్ ఇచ్చాడు. ఓ రకమైన సంతృప్తితో ఇంటికి తీసుకొచ్చాడు.

** ** **

పిల్లల్లేని జానకికి జింక పిల్లంటే ఎంత ముద్దో అంత జాలి కూడా. ఆమెలో రోజు రోజుకూ మానసిక సంఘర్షణ ఎక్కువవుతోంది. అందులోంచి విపరీతమైన ఊహలు. నాలుగు గోడలూ ఒక్కసారిగా కొంచెం కొంచెం... జరుగుతూ జరుగుతూ... దగ్గరి కొచ్చి నలిపేస్తున్నట్లు ఊహలు. ఆ ఇంట్లో ఆమెకూ, జింకకూ ఉండే వ్యత్యాసం - జింక తాడుతో కట్టివేసి ఉంది. ఆమె తాడు లేకుండా బంధితురాలు. దాని గెంతులు పదివరకే పరిమితం. ఆమె గమనం పది గదుల వరకే పరిమితం. దానికేం కావాలో అది చెప్పలేదు. ఆమె కేం కావాలో అది రాదు. బంధిత అయిన తరువాత పంజరం ఇనుపదైనా ఒకటే, బంగారపుదైనా ఒకటే.

ఆమె ఆలోచనలకు రెక్క లొస్తున్నాయి.

** ** **

ఓ రోజు-

కేంపు నుంచి వచ్చిన ఆనంద్ గుండెనూ, మెదడునూ కదిల్చివేసే రెండు నిజాల్ని విని తట్టుకోలేకపోయాడు.

ఒకటి... జానకి లేచి పోవడం.

రెండు... జింక అసలు లేకపోవడం ! ♦